క్లుప్తంగా

పిల్లలకు వైద్య పరీక్షలు



దంత వైద్య పరీక్ష చేస్తున్న వైద్యురాలు

సీతంపేట: వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అక్కయ్యపాలెంలోని సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. కో ఆర్డినేటర్ డాక్టర్ సమత ఆధ్వర్యంలో వైద్య బృందం శాంతిప్రియ, ప్రియాంక, సౌజన్య, శాంతి పిల్లలకు దంత, కంటి, సాధారణ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైఆర్‌జీ కేర్ సంస్థ ప్రతినిధులు సుబ్బలక్ష్మి, పద్మప్రియ, దినేష్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: కె.వి.మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రపంచ రంగ స్థల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు, డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. సౌజన్య కళాసమితి ప్రదర్శించిన ఎడ్రస్ లేని మనిషి నాటిక ఆలోచింపజేసింది. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చౌదరి అప్పారావు, దాడి సత్యనారాయణ, వి.నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

డాబాగార్డెన్స్: సీతమ్మధార లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు పొందుతున్న జాలరిపేటకు చెందిన వి.దేవికకు ఆర్థిక సాయం అందజేశారు. ఆస్పత్రి ట్రస్టీ వెలగపూడి ఉమామహేశ్వరరావు సమక్షంలో లయన్ బీఎస్ మాణిక్యం తన సొంత నిధుల నుంచి రూ.10 వేలు, లయన్స్ నార్త్ ట్రస్ట్ తరఫున కార్యదర్శి బి.కృష్ణారావు రూ.10 వేలను సోమవారం అందించారు. దాతలకు దేవిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బిషప్ కాయిత మరియదాస్ కమ్యూనిటీ హాల్లో సోమవారం యునైటెడ్ వే ముంబాయి, ఆది హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ బి.కిరణ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ప్రగతి మిత్ర సహకారంతో సెబాస్టియన్, బాబు కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల గర్భిణులకు ఉచిత పౌష్టికాహారం(డ్రై ఫ్రూట్స్) కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు వేశంగి జీరావు, దేవి, ఈశ్వరి, ఆనంద్, చరణ్, బాబ్జీ, కమల్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా జరిపారు. ఉభయదాతలకు స్వామి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం

- అందమైన పార్కులుగా గ్రీన్‌బెల్ట్‌లు
- వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు



గ్రీన్‌బెల్ట్ మధ్యలో సిమెంట్ బెంచీ



సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో నిర్మించిన వాకింగ్ ట్రాక్, ఆకర్శణీయంగా చెట్లు

సీతంపేట: ఆరోగ్యం.. ఆహ్లాదం రెండూ ఒకే చోట దొరికేలా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లను అందమైన పార్కులుగా తీర్చిదిద్దారు. జీ20 సదస్సు నేపథ్యంలో హైవేకు మణిహారంగా ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాలను ఆహ్లాదాన్ని, ఆరోగ్యనిచ్చే హెల్తీ పార్కులుగా అభివృద్ధి చేశారు. శిథిలమైన ఫెన్సింగ్, చెత్తాచెదారంతో, ఆకతాయిలు, మందు బాబులకు అడ్డాలుగా మారిన గ్రీన్‌బెల్ట్ రూపురేఖలు ఇపుడు మారిపోయాయి. సత్యం కూడలి వద్ద గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పచ్చని చెట్ల మధ్య ఒకవైపు వాకింగ్ ట్రాక్.. మరో వైపు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ స్థానికులు సేదతీరేందుకు సిమెంట్ బెంచీలు నిర్మించారు. చెట్లకు మువ్వన్నెల జెండాను తలపించేలా వేసిన రంగులు ఆకట్టుకుంటున్నాయి. గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఫెన్సింగ్‌ను పునరుద్ధరించి పెయింటింగ్ వేశారు. లోనికి వెళ్లేందుకు గేటు ఏర్పాటు చేశారు. మొత్తంగా గ్రీన్‌బెల్ట్ ఒక పార్కులా స్థానికులను ఆకర్షిస్తోంది.

పచ్చని చెట్ల మధ్య వాకింగ్ ట్రాక్

సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పచ్చని చెట్ల మధ్య వాకింగ్ ట్రాక్ నిర్మించారు. గ్రీన్‌బెల్ట్‌ను చదును చేసి రెండు మీటర్ల వెడల్పు, 509 మీటర్ల పొడవుతో దీనిని సిద్ధం చేశారు. కాంక్రీట్‌తో ట్రాక్ నిర్మించి మధ్యలో గ్రావెల్ పరిచారు. నడవడానికి వీలుగా దానిపై మొత్తం క్రషర్ బుగ్గిని పరిచారు. వాకింగ్ చేసిన వారు కాసేపు సేదతీరేందుకు పార్కు మధ్యలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు.

ఆరోగ్యానికి ఓపెన్ జిమ్

కార్పొరేటర్ల ఏడాది పదవీ కాలం పూర్తయిన సందర్భంగా వార్డు అభివృద్ధి కోసం మంజూరైన రూ.5 లక్షల నిధులతో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఇదే గ్రీన్‌బెల్ట్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. భుజాలు, చేతులు, నడుము, పొట్ట భాగాలు తగ్గేందుకు రోవర్, సోల్డర్ బిల్డర్, ట్రిపుల్ స్టాండింగ్ ట్విస్టర్, హార్స్ రైడర్, స్కైవాకర్, క్రాస్ ట్రైనర్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. జిమ్ పక్కనే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో వ్యాయామానికి అనువుగా ఉంటుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికుల హర్షం

గ్రీన్‌బెల్ట్‌లో కాసేపు వాకింగ్.. మరికొద్ది సేపు ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసుకునే అవకాశం కలిగిందని సీతంపేట పరిసర ప్రాంతాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వాకింగ్‌కు చాలా దూరం వెళ్లాల్సి వచ్చేదని, ఇపుడు అందుబాటులోకి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ వచ్చాయని అంటున్నారు. కరోనా తర్వాత ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగినా.. వాకింగ్, వ్యాయామం కోసం జిమ్‌కు వెళ్లాలన్నా దూరాభారం, ఖర్చుతో కూడుకున్న పనికావడంతో చాలా మంది వెనుకంజ వేసేవారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులతో ఖర్చు లేకుండా ఇంటికి సమీపంలో వసతులు సమకూరాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఓపెన్ జిమ్‌లో పరికరాలు

ప్రజలందరికీ మేలు జరిగేలా పథకాలు



సిద్ధార్థనగర్‌లో బోరు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ చల్లా రజని



వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు సమస్యలు వివరిస్తున్న గజపతినగర్ మహిళ

'గడప గడపకు మన ప్రభుత్వం'లో కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ చల్లా రజని ఈశ్వరరావుతో కలిసి ఐటీఐ కూడలి పరిధి సిద్ధార్థనగర్, గజపతినగర్ 304 సచివాలయం ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలందరికీ మేలు జరిగేలా అనేక సంక్షేమ పథకాలను నిజాయితీగా, నిష్పక్షపాతంగా అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా ఆయన పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పలు గడపల్లో ప్రజాదరణ కనిపించింది. స్థానికులు పలు సమస్యలపై కె.కె.రాజు, జోన్–5 అధికారులకు వినతిపత్రాలు అందించారు. అనంతరం సిద్ధార్థనగర్‌లో కొత్తగా నిర్మించిన బోర్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, ఆర్.వెంకటరమణ, జోన్–5 ఏపీడీ పద్మావతి, కో ఆప్షన్ సభ్యులు ఎస్.అప్పారావు, ఆళ్ల శ్రీనివాస్, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రత్నాకర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్లు పిల్లి సుజాత, రాయుడు శ్రీను, నూకరాజు, ఎస్.రవికుమార్, వార్డు నాయకులు కడితి చిరంజీవి, రవణమ్మ, అచ్యుతరావు, దిలీప్, సారిపల్లి జగదీష్, రాధాకృష్ణ, శివ, పల్లా సోమేష్, బి.కల్యాణ్, నమ్మి శంకర్, సత్యారావు, తులసిరావు, నాగరాజు, నరిసింగ్, ప్రకాష్, యువజన విభాగం ఇన్‌చార్జ్ ఎం.సునీల్, పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించిన కె.కె.రాజు కొన్ని అర్జీలను వెంటనే పరిష్కరించారు. మరి కొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి సునీల్, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, రత్నాకర్, బాపునాయుడు, కిరణ్ రాజు, పలువురు వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు..



టెన్త్ విద్యార్థులతో డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, పూర్వ విద్యార్థులు

అల్లిపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అందుకుంటారని డిప్యూటీ డీఈవో ఎ.గౌరీశంకర్ అన్నారు. అల్లిపురం వైర్‌లెస్ కాలనీలోని ప్రభుత్వ హైస్కూల్‌లో అర్ధ శతాబ్దం కిందట చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయ పాలన, ఆరోగ్యం, తగిన నిద్ర, పౌష్టికాహారం, ఏకాగ్రతతో కూడిన విద్యాభ్యాసం వల్ల వార్షిక పరీక్షల్లోనే కాక జీవితంలో ఎదురయ్యే ప్రతి పరీక్షలో ఉత్తీర్ణుల వుతారన్నారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నిమిత్తం దిశానిర్దేశం చేశారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలతో ఉన్న అనుబంధం, వాళ్ల ప్రోత్సాహక కార్యక్రమాలను అభినందించారు. అనంతరం పరీక్ష అట్టలు, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా అందజేశారు. డైట్ కళాశాల (భీమిలీ) రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ డబ్బీరు రమామణి మాట్లాడుతూ తన తల్లి డబ్బీరు సుగుణ జ్ఞాపకార్థం ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు బాలికలకు రూ.5 వేల చొప్పున ఉపకార వేతనం అందజేయనున్నట్లు ప్రకటించారు. బాలురకు కూడా మంచి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.లక్ష్మణరావు, పూర్వ విద్యార్థులు దత్తి ప్రసాదరావు, బూరె రమేష్, పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఆర్. ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదానికి పిలుపు

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వ పాలనను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 5న చలో ఢిల్లీ పేరిట సీఐటీయూ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం 61వ వార్డు మల్కాపురంలోని సిటు కార్యాలయం వద్ద మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి ఆవిష్కరించి, మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం చాలా నిరంకుశంగా పాలిస్తోందని మండిపడ్డారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టి.. పెత్తందారులకు పట్టువస్త్రాలు పరుస్తున్నారని ఆరోపించారు. వీరికి దేశ భవిష్యత్ కంటే బడాబాబుల దీవెనలే ముఖ్యమని విమర్శించారు. కార్మికులు, నిరుద్యోగులు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు పెంటారావు, పైడిరాజు, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ఆకట్టుకుంటున్న వాటర్ ఫౌంటైన్



పెదగదిలి కూడలిలో విద్యుత్ కాంతుల మధ్య వాటర్ ఫౌంటైన్

ఆరిలోవ: పెదగదిలి కూడలి వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్ ఆకట్టుకుంటోంది. ఈ కూడలిలో కొన్ని దశాబ్దాలుగా పెద్ద నుయ్యి నిరుపయోగంగా మారింది. ఈ బావి చుట్టూ ఇటీవల జీవీఎంసీ అధికారులు కమలం ఆకారంలో నిర్మాణం చేపట్టారు. అనంతరం వాటర్ ఫౌంటైన్‌గా మార్చారు. రంగు రంగుల విద్యుత్ కాంతుల మధ్య నీరు పైకి చిమ్ముతూ రాత్రి వేళ ఈ ఫౌంటైన్ కనువిందు చేస్తోంది. స్థానికులతోపాటు అటుగా వెళ్లే ప్రయాణికులు ఇక్కడ కొంతసేపు ఆగి ఫొటోలు తీసుకుంటున్నారు. దీంతో ఈ కూడలి వద్ద సందడిగా మారింది.

ఘనంగా పోలమాంబ పందిరి రాట వేడుక



పందిరి రాట వేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, అక్కరమాని విజయనిర్మల దంపతులు, భక్తులు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతరలో భాగంగా సోమవారం పందిరి రాట మహోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. పుట్టబంగారం తీసుకొచ్చే కార్యక్రమం(దేవర పండగ) నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, గేదెల లావణ్య, ఎస్.నూకత్నం, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం సభ్యులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకరరెడ్డి, ఈవో సురేష్‌బాబా పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పారిశుధ్యం



రహదారిని శుభ్రం చేయిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

జగదాంబ: పారిశుధ్యం పట్ల మరింత శ్రద్ధ కనబరచాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. సోమవారం ఫుడ్‌కోర్టు, జ్ఞానాపురం, పాతపోస్టాఫీసు ప్రాంతాల్లో దగ్గరుండి పారిశుధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి జి–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రహదారుల్లో ఎక్కడా చెత్తకుప్పలు ఉండకూడదన్నారు. అలాగే డస్ట్‌బిన్లలో చెత్తను ఉదయాన్నే వాహనాల ద్వారా యార్డుకు తరలించాలన్నారు. డివైడర్ల మధ్యనున్న మొక్కల పరిరక్షణ బాధ్యత హార్టీకల్చర్ అధికారులే చూసుకోవాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఫ్లైఓవర్, రైల్వేస్టేషన్ రహదారి, సిరిపురం, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పరిసరాలు పరిశుభ్రం చేయాలన్నారు. వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, సెక్రటరీలు అందుబాటులో ఉండాలన్నారు.

పబ్లిక్ డిమాండ్

రామనాయుడు కాలనీలో కోతుల బెడద



రామనాయుడు కాలనీలోని ఓ ఇంటి మెట్లపై కూర్చున్న వానరం

మద్దిపాలెం: జీవీఎంసీ 57వ వార్డు మహారాణి వీధి రామనాయుడు కాలనీలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాటి బెడదతో నివాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. స్కూల్‌కు వెళ్లే పిల్లల మీద దాడి చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి వంట సామగ్రిని నాశనం చేస్తున్నాయి. డాబా మీదకు వచ్చి ఆరవేసి ఉన్న దుస్తులను చింపేస్తున్నాయి. ఇటీవల ఒకరిపై దాడి చేసి గాయపరిచాయి. డస్ట్‌బిన్లను చెల్లాచెదారు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.వెంకటేశ్వరరావు, రామనాయుడు కాలనీ

కంచరపాలెం రైతుబజార్‌లో దొంగతనాలు



రైతుబజార్‌లో పనిచేయని సీసీ కెమెరా

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ సమస్యపై ఎస్టేట్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి రైతుబజార్‌లో సీసీ కెమెరాలను పరిశీలించి పనిచేసేలా చర్యలు చేపట్టాలి.

– జి.చిన్నారావు, కంచరపాలెం

రోడ్డు పక్కన చెత్తకుప్ప



లలితానగర్‌లో రోడ్డు పక్కన వదిలేసిన చెత్త

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని అయ్యంగారి బేకరీ పక్కన చెత్తను కుప్పగా పడవేశారు. మూడు రోజులుగా దానిని ఎవరూ తరలించలేదు. చెత్త నుంచి వచ్చే దుర్వాసన, ఈగలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల మధ్యలో ఇలా చెత్త పడేయడం చాలా ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– కె.శ్రీనివాసరావు, లలితానగర్

మ్యాన్‌హోల్ సమస్యకు పరిష్కారం



నాడు: సత్యానగర్–1 రహదారిలో మ్యాన్‌హోల్ స్థితి



నేడు: రోడ్డుకు సమాంతరంగా మ్యాన్‌హోల్‌ను సరిచేస్తున్న కార్మికుడు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు సత్యానగర్–1లో ఇటీవల నిర్మించిన తారు రోడ్డు మధ్యలోని యూజీడీ మ్యాన్‌హోల్‌ను సరిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు చొరవతో ఈ ప్రాంతంలో రూ.15 లక్షలతో రహదారి నిర్మించారు. తారు వేసినప్పుడు ఓ చోట మ్యాన్‌హోల్ కిందికి ఉండిపోవడంతో అక్కడ గోతులుగా తయారయ్యాయి. వీటిని తక్షణం సరిచేయాలని కార్పొరేటర్ అల్లు శంకరరావు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మ్యాన్‌హోల్‌ను రహదారికి సమాంతరంగా ఏర్పాటు చేసి సిమెంట్‌తో సరి చేశారు. మాన్‌హోల్ వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించారు. ఈ సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


డిగ్రీలతోపాటు నైపుణ్యాలూ ప్రధానం



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అత్యంత పోటీ ప్రపంచం యువతకు ఆహ్వానం పలుకుతోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఈసీఈ విభాగ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి తరం డిగ్రీలతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంత శక్తి విద్యార్థుల సొంతమని, మస్తిష్కంలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో చూపాలన్నారు. వ్యాపారాత్మక ఆలోచనలు ప్రోత్సహించడానికి యూనివర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. సాంకేతికత మార్పులు యువతకు సవాళ్లు విసురుతోందని, వీటికి పరిష్కారాలు చూపే సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొదించే దిశగా కృషి జరగాలని ఆచార్యులకు సూచించారు. ఆచార్యులు ఆత్మావలోకనం చేసుకుంటూ అసాధారణ పనితీరు, ప్రగతిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ రంగాలు భవిష్యత్ సమాజంపై అత్యంత ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ రంగంలో ఈసీఈ విద్యార్థులు అడుగు పెట్టాలన్నారు. ఏయూ పూర్వ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ స్టార్టప్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ సాధిస్తున్న ప్రగతి ప్రశంసనీయమన్నారు. జీవీపీ కళాశాల డీన్ ఆచార్య కె.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అన్ని రంగాలలో ఏయూ అద్భుతమైన ప్రగతిని చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్‌బాబు, విభాగాధిపతి ఆచార్య పి.రాజేష్ కుమార్, అనిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరామకృష్ణ, డాక్టర్ అనూరాధ, డాక్టర అరుణ, డాక్టర్ పి.వి.శ్రీదేవి, ఆచార్య కె.రమాసుధ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో రాష్ట్రానికి అన్యాయం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార: పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట ప్రతిపాదించిన ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లను కాదని.. నేడు దాన్ని తగ్గించేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేయాలని, నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్.కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.